బాలయ్యా.. హామీల అమలేదయ్యా?

లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు తెస్తానంటూ ప్రగల్భాలు

- సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలను రప్పించి మరో బెంగళూరుగా మారుస్తానని వంచన
- నియోజకవర్గంలో తాగునీటి సమస్యలేకుండా చేస్తానన్న హామీ గాలికి !
- 'పురం'లో అండర్ డ్రైనేజీ మాట హుళక్కే
- వందరోజుల పాలనలో ఏ ఒక్క హామీపై దృష్టిపెట్టని ఎమ్మెల్యే బాలకృష్ణ



'పదవిలోకి వచ్చేదాకా జనం మనం.. జనం వరం.. అని కూసే మీ నాలుక నరం.. పదవిలోకి రాగానే నరం మారి, స్వరం మారి, మనం వేరు.. జనం వేరు. జనమే లేరూ అని రంగు మార్చే మాటల బేరం ఇక సాగదూ' అంటూ ఓ సినిమాలో బాలకృష్ణ డైలాగ్ చెప్పారు. అయితే నిజజీవితంలో ఎమ్మెల్యేగా ఆయనకు ఈ డైలాగ్ సరిగ్గా సరిపోతుంది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు గుప్పించి ఆ తర్వాత వాటి గురించి మర్చిపోయారాయన.

హిందూపురం: హిందూపురం నియోజకవర్గంలో బాలకృష్ణ వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దాదాపుగా పదేళ్ల ఎమ్మెల్యే పదవిలోనే ఉన్నారు. ప్రతి ఎన్నికలకు ముందు హిందూపురం నియోజకవర్గ రూపురేఖలు మార్చేస్తానని చెబుతూనే ఉన్నారు. రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో హిందూపురం నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో నిలుపుతానని ఎన్నోసార్లు చెప్పారు. అయితే ఆయన ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి దాకా నియోజకవర్గంలో గర్వించదగ్గ అభివృద్ధి జరగలేదు. హిందూపురం పట్టణాభివృద్ధికి కూడా ఎమ్మెల్యే బాలకృష్ణ చేసింది శూన్యం. కనీసం సరైన రోడ్లు, పార్కులు, ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్స్ ఏర్పాటు చేయలేకపోయారు. హిందూపురానికి పక్కనే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని గౌరిబిదనూర్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రహదారులన్నీ విస్తరింపచేస్తూ వేగంగా ముందుకెళ్తున్నారు. అయితే శ్రీ సత్యసాయి జిల్లాలోనే అతిపెద్ద పట్టణంగా ఉన్న హిందూపురంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.



క్యాన్సర్ ఆస్పత్రి ఊసేదీ?

హిందూపురంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసి ఏ ఒక్కరూ క్యాన్సర్ వ్యాధితో చనిపోకుండా చూస్తానని ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతున్నా క్యాన్సర్ ఆస్పత్రి అంశాన్ని ఏ సందర్భంలోనూ ఆయన ప్రస్తావించలేదు.

యునెస్కో గుర్తింపు దిశగా చర్యలేవీ?

యునెస్కో తాత్కాలిక గుర్తింపు లభించిన లేపాక్షి ఆలయానికి శాశ్వత యునెస్కో జాబితాలో చోటు దక్కేలా చర్యలు చేపడతామని ఎన్నికలప్పుడు బాలకృష్ణ హామీ ఇచ్చారు. అయితే రోజులు గడచిపోతున్నా ఆ దిశగా ఇప్పటి దాకా చర్యలు మాత్రం చేపట్టలేదు. యునెస్కో గుర్తింపు సంగతి దేవుడెరుగు కనీసం ఆలయ పరిధిలో మౌలిక వసతులు కూడా సరిగ్గా లేవంటూ భక్తులు పెదవివిరుస్తున్నారు.



లేపాక్షి ఆలయ ముఖద్వారం

మాటిచ్చారు.. మర్చిపోయారు



హిందూపురంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ప్రతిసారి ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే బాలకృష్ణ చెబుతూనే ఉన్నారు. ఏళ్లు గడచిపోతున్నాయి తప్ప నేటికీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. బసవతారకం ఆస్పత్రి ఏర్పాటు చేస్తే ఎంతో మందికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఎన్నికలప్పుడు చెప్పడం తర్వాత మర్చిపోవడం బాలకృష్ణకు రివాజుగా మారింది.

– రామాంజినేయులు, చిలమత్తూరు

ఎన్నికల ప్రచారంలో బాలకృష్ణ హామీలిలా..

- ✔ హిందూపురం జిల్లా కేంద్రంగా మార్పు చేయిస్తాను.
- ✔ హిందూపురం పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులను రెండులైన్ల రోడ్లుగా మార్పుచేయిస్తాను.
- ✔ హిందూపురంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ స్థానంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.
- ✔ ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి హిందూపురంలో ఉర్దూ కళాశాల ఏర్పాటు చేయిస్తాను.
- ✔ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తాము.
- ✔ హంద్రీనీవా ద్వారా చిలమత్తూరు మండలంలో కేవలం నాలుగు గ్రామాలకే నీరు చేరుతోంది. అలా కాకుండా కాలువను పునరుద్ధరిస్తూ దేమకేతపల్లి చెరువుకు నీరు తెప్పించి అక్కడి నుంచి సోమగట్ట వరకూ నీరొచ్చేలా చేసి అటూ గోరంట్ల మండలానికి వెళ్లేలా చేసి ప్రజల దాహాన్ని తీరుస్తాము.

'మరో బెంగళూరు' మాటలకే పరిమితం



హిందూపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను ఎన్టీఆర్ అభివృద్ధి చేశారు. అదే బాటలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలతో పాటు వివిధ రంగాల కంపెనీలు ఏర్పాటు చేసి నిరుద్యోగులు బెంగళూరుకు వలసలు పోకుండా మరో బెంగళూరుగా హిందూపురాన్ని మార్పుచేయిస్తానని ఎమ్మెల్యే బాలకృష్ణ ఎన్నికలప్పుడు ప్రగల్భాలు పలికారు. చుట్టపు చూపు ఎమ్మెల్యేగా ముద్రపడిన బాలకృష్ణ ప్రస్తుతం జనానికి కనపడటమే మహా భాగ్యమైపోయింది. ఇంక ఆయన పురాన్ని మరో బెంగళూరుగా ఎప్పుడు చేసేది అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

లేపాక్షి అభివృద్ధి పట్టదా?



తాము అధికారంలోకి వస్తే లేపాక్షి ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటక ముఖ్యకేంద్రంగా కృషి చేస్తానని సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ ఇచ్చారు. యునెస్కో శాశ్వత గుర్తింపు తెప్పిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా అలాంటి ప్రయత్నం ఏ కోశానా చేయడం లేదు. ఎన్నికల ప్రచారం చేసి ఆ తర్వాత సినిమాలకే పరిమితమవుతున్నారు.గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా అనేక హామీలిచ్చినా నేటికీ పూర్తి చేయలేకపోయారు.

–శంకర్‌రెడ్డి, నాగేపల్లి, లేపాక్షి మండలం

బాలకృష్ణ చేసింది శూన్యం



ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రతిసారి ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఆ తర్వాత మర్చిపోతారు. అసలు ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉంటేనే కదా ఇక్కడి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసేది. ఏం సమస్య వచ్చినా ఎమ్మెల్యే పీఏను వేడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని ఆయన ప్రస్తావించిన పాపానపోలేదు. ఈ వంద రోజుల్లో హిందూపురంలో అశాంతి పాలన స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి మాట సంగతి అటుంచితే .. మొదట తమకు అందుబాటులో ఉంటే చాలని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసి ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చూడాలి.

– టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, హిందూపురం

అభివృద్ధిలో వెనుకంజే..



హిందూపురం పట్టణం అభివృద్ధిలో వెనుకబడింది. కనీసం సరైన రోడ్లులేవు. ట్రాఫిక్ నియంత్రణ లేదు. ప్రధాన రహదారుల్లో లైటింగ్ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హిందూపురం ప్రజలు ఎంతో నమ్మకంతో మూడుసార్లు బాలకృష్ణను ఎమ్మెల్యేగా గెలిపించారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చి ఎమ్మెల్యే బాలకృష్ణ తన మార్క్ చూపించాలి.

–అరుణదేవి, హిందూపురం

క్లుప్తంగా

ట్రాక్టర్ - ఐచర్ ఢీ



రోడ్డుపై అడ్డుగా పడి ఉన్న ఐచర్

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకుల సమీపంలో జాతీయ రహదారిపై ట్రాక్టర్, ఐచర్ వాహనాలు శుక్రవారం రాత్రి ఢీ కొన్నాయి. బెంగళూరు వైపు నుంచి వస్తున్న ఐచర్ సోమందేపల్లి వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఐచర్ డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. రోడ్డుపై రెండు వాహనాలు అడ్డుగా పడిపోవడంతో జాతీయ రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలు పక్కను తరలించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

రొళ్ల: మండలంలో ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ నమోదు కోసం ఈ-కేవైసీని చేయించుకోవాలని వీఏఏ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బీజీ హళ్లి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈ-కేవైసీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అగళిలో విజృంభిస్తున్న జ్వరాలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వేచివున్న రోగులు

అగళి: మండలాన్ని జ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణ మార్పులతో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా పారిశుధ్య లోపం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. శుక్రవారం ఒక్కరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శివానంద తెలిపారు. వారిలో 150 మంది జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగల్ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఉపాధి పథకం కింద ఉన్న గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించి కూలీల శాతాన్ని పెంచాలని సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు పాల్గొన్నారు.

వైఎన్ హొసకోట ఆస్పత్రికి అంబులెన్స్ మంజూరు



టీహెచ్ఓతో మాట్లాడుతున్న డీహెచ్ఓ చంద్రశేఖర్

పావగడ: తుమకూరు జిల్లా ఆరోగ్యాధికారి చంద్రశేఖర్ స్థానిక వైఎన్ హొసకోట ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం సందర్శించారు. ఇటీవల వైఎన్ హొసకోట ఆస్పత్రిలో మృతి చెందిన వృద్ధుడు గుడగుల్ల హొన్నూరప్పను అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మృతుని కుమారులే బైక్‌పైన తండ్రి మృతదేహాన్ని దళవాయిహళ్లికి తరలించిన విషయం తెలిసిందే. మీడియా ద్వారా విషయాన్ని తెలుసుకున్న డీహెచ్ఓ చంద్రశేఖర్ వైఎన్ హొసకోట ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులు, టీహెచ్ఓ డా కిరణ్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్‌లేకపోవడంతో సమస్య వచ్చిందని గుర్తించి వెంటనే ఆస్పత్రికి అంబులెన్స్ మంజూరు చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

హిందీకి విస్తృత ప్రచారం కల్పిద్దాం



హిందీ భాషా సేవకులను సన్మానిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: రాజభాష హిందీకి విస్తృత ప్రచారం కల్పిద్దామని మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం హిందీ దివస్ హొ కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్ జాబిలి చాంద్‌బాషా అధ్యక్షతన హిందీ దివస్ వేడుకలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత మాట్లాడుతూ జాతిని సమైక్య పరచి భారత పౌరుల్లో దేశభక్తిని పెంపొందించడంలో హిందీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఆధ్యాత్మిక వేత్త రవిశంకరగురూజీ, ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, యూటీఎఫ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన మధుమతిరెడ్డి



హిందూపురం: నియోజకవర్గ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను జగనన్న దృష్టికి తీసుకెళ్లినట్లు మధుమతిరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వెరవకుండా పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని సూచించారని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొన్న మంత్రి సవిత

రొద్దం: ప్రజల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సవిత అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కోగిర గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్ వేసి కరపత్రాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నేతపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: అగ్రికల్చర్ సచివాలయ ఉద్యోగి పవన్‌కుమార్‌రెడ్డిని దుర్భాషలాడిన పరిగి టీడీపీ నేత వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రెడ్డి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రెడ్డి జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు అంజినరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు సుబ్బిరెడ్డి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

సర్వేయర్ మృతి బాధాకరం

అమరాపురం: మండల పరిధిలోని వీ ఆగ్రహారం గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న పవన్ విద్యుదాఘతంలో మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ సర్పంచ్ వాగేష్ తెలిపారు. శుక్రవారం వాగేష్, సదానందగౌడ్ తమ్మేదేపల్లి గ్రామానికి వెళ్లి పవన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఎంపికకు అండర్ 14, 17 బాలబాలికల పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం అశ్వత్తనారాయణ, సర్పంచ్ గంగమ్మ క్రీడా పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, అథ్లెటిక్స్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీఈటీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

23 వరకూ ఈక్రాప్‌కు అవకాశం

చిలమత్తూరు: ఈక్రాప్ నమోదుకు ఈనెల 23 వరకూ అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారి వంశీకృష్ణ అన్నారు. మండలంలో ఇప్పటి వరకూ ఖరీఫ్‌లో 12,451 ఎకరాల్లో 6,234 మంది రైతులకు పంట నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

గుడిబండ: మండల కేంద్రంలోని తపాలా సబ్ కార్యాలయంలో ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలు అందుబాటులోకి తెచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్‌మాస్టర్ సుదర్శన్ తెలిపారు. ఐదేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలకు తల్లిదండ్రులు నూతనంగా ఆధార్‌కార్డు తీసుకోవచ్చన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్‌పై తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసిన భూములను రీవెరిఫికేషన్ తీరును ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్, ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ పూర్తి చేసిన రీవెరిఫికేషన్ భూముల వివరాలను పరిశీలించారు. త్వరితగతిన రీవెరిఫికేషన్ పూర్తి చేయాలని తహసీల్దార్ ఆనంద్‌బాబును ఆదేశించారు.

సంక్షిప్త సమాచారం

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

హిందూపురం: మండల పరిధిలోని మణేసముద్రానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కె.ప్రసాద్ కుమారుడు విక్టర్ శ్యాంసన్ నీట్‌లో 5,514 ర్యాంకు సాధించి కుప్పం మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం మణే సముద్రం గ్రామస్తులు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి విక్టర్ శ్యాంసన్‌ను సన్మానించారు. హెచ్ఎం జయమ్మ , ఉపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, కృష్ణనాయక్, భారతి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తాం

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రంలో దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిశేఖర్ తెలిపారు. శ్మశాన వాటికకు రహదారిలేక చెరువులో నడుస్తూ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించిన సంఘటన నేపథ్యంలో తహసీల్దార్‌తో పాటు సీఐ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాలసముద్రం గ్రామాన్ని పరిశీలించారు.

ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సాయినగర్ వద్ద శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొనడంతో గురురాజ్, శ్రీరామ్ అనే ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కేబుల్ చోరీ

రొద్దం: మండల పరిధిలోని పెద్దిపల్లిలో వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌ను గురువారం రాత్రి దొంగలు అపహరించారు. దాదాపు ఎనిమిది మంది రైతుల బోరుబావుల వద్ద మోటార్ల నుంచి విద్యుత్ స్టార్టర్ వరకూ ఉన్న కేబుల్‌ను కట్ చేసి ఎత్తుకెళ్లారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పారదర్శకంగా పంట కోత ప్రయోగాలు

అమరాపురం: మండలంలో పంట కోత ప్రయోగాలను పారదర్శకంగా నిర్వహించాలని ఏఎస్ఓ రమణనాయక్ కోరారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ మంజునాథ్, ఏఈఓ అమర్నాథ్ రెడ్డి, సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హి సేవ



పెనుకొండ మండలం మావటూరులో మొక్క నాటుతున్న తహసీల్దార్ శ్రీధర్

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం సాగుతోంది. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పని చేస్తున్న కార్యాలయాల పరిసరాల్లో పారిశుధ్యం పనులు చేపట్టారు.

మిర్చి రైతులు నష్టపోకుండా చూడండి

హిందూపురం అర్బన్: ఎండు మిర్చి హిందూపురం మార్కెట్‌కు రావడం మొదలైంది. అయితే రైతులు మిర్చిని ప్లాస్టిక్ కవర్లలో నింపుతున్నారని, కొందరు కూలీలు మిర్చిని కొంత తీసుకుంటున్నారని రైతులు రైతు సంఘం నాయకుడు ధనాపురం వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం మార్కెట్‌ను మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్‌రెడ్డితో కలిసి రైతు సంఘం నాయకులు పరిశీలించారు. రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో మాట్లాడారు. మిర్చి రైతులకు నష్టం జరగకుండా చూడాలని సూచించారు. మార్కెట్‌లో ప్లాస్టిక్ సంచుల వినియోగించడాన్ని పూర్తిగా మానాలని, హమాలీలు రైతుల దగ్గర నగదు తీసుకోవాలి తప్ప మిర్చి తీసుకోకూడదన్నారు. రైతులు మిర్చి అమ్మిన వెంటనే నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

హిందూపురం: సీజనల్ వ్యాధులను నియంత్రణలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీపీఎంఓ కుళ్లాయప్పనాయక్ ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మున్సిపల్ ఆఫీసులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రబలే వ్యాధులు, అంటు వ్యాధులపై జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనాథ్‌రెడ్డి, ఏఎంఓ లక్ష్మీనాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ శివన్న తదితరులు పాల్గొన్నారు.